RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి -01 సంచిక - 214 బుధవారం 27 మార్చి 2024, ఎడిటర్: సీఎం. శ్రీనివాస్ , పేజీలు - 4 , వెల -03/-

# నేటి నుంచి 'మేమంతా సిద్ధం' సభలు ప్రారంభం

- రాష్ట్రంలోని ప్రతి లోక్ సభ సెగ్మెంట్ లో పర్యటించటమే ధ్యేయంగా యాత్ర ప్రారంభించనున్న జగన్
- మొదటగా నేడు ప్రొద్దుటూరులో బహిరంగ సభ




**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 26:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల రణరంగంలో దిగనున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో నేరుగా ప్రజా క్షేత్రంలో ప్రచారానికి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అడుగుపెట్ట బోతున్నారు. దీనితో వైఎస్ ఎన్నికల క్యాంపెయిన్ మేమంతా సిద్ధం పై రాష్ట్ర రాజకీయాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.రాష్ట్రంలోని 20 లోక్‌సభ సెగ్మెంట్‌లను కవర్ చేస్తూ ఇడుపులపాయ నుండి ఇచ్ఛాపురం వరకు సాగే వైఎస్ఆర్‌సీపీ ప్రతిష్టాత్మకమైన 'మేమంతా సిద్ధం' 21 రోజుల బస్సు యాత్రకు రంగం సిద్ధమైంది. మార్చి 27న పులివెందుల నియోజకవర్గం నుంచి ప్రారంభంకానున్న ఈ యాత్ర సిద్ధం సభలను పునర్ ప్రతిబింభిస్తు ప్రాంతీయంగా నిర్వహించనున్నారు. కడప లోక్‌సభ సెగ్మెంట్‌కుగాను వైయస్ జగన్ ప్రొద్దుటూరులో 'మేమంతా సిద్ధం' ప్రారంభ బహిరంగ సభను నిర్వహించనున్నారు.ఈ మహా కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి ప్రాంతంలోని సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఇప్పటికే అభ్యర్థులందరినీ ప్రకటించి జగన్ చురుగ్గా ప్రచారం చేస్తుండగా, తెలుగుదేశం, జనసేన, బీజేపీ వంటి ప్రతిపక్ష పార్టీల విమర్శలను ప్రస్తావిస్తూ,

వివరాలు 2లో



- టిడిపి అధికారంలోకి రాగానే 60 రోజుల్లో మెగా డీఎస్సీ - ఏపీని కాపాడుకునేందుకే పొత్తులు - వందరోజుల్లోనే జే బ్రాండ్ మద్యం నిషేధం
- అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఇంటింటికి 4వేల రూపాయల పెన్షన్ పంపిణీ

# వాలంటీర్లకు 50,000 ఆదాయం వచ్చేలా చేస్తా...: చంద్రబాబు

**ఆంధ్ర ప్రగతి/కుప్పం మార్చి 26:** వాలంటీర్లకు చంద్రబాబు బంపర్ ఆఫర్ ఇచ్చారు. వాలంటీర్లు నెలకు రూ.30 వేల నుంచి రూ.50 వేలు సంపాదన వచ్చేలా వారికి స్కిల్ డెవలప్మెంట్ ద్వారా శిక్షణ ఇస్తామన్నారు.వారి జీవితాలు మారుస్తామన్నారు. వారు నీతి, నిజాయితీగా ఉండాలని. వైసీపీ చెప్పిన పనులు చేస్తే మాత్రం జైలుకెళ్తారని హెచ్చరించారు. కుప్పంలో యువతతో చంద్రబాబు సమావేశం అయ్యారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి నియోజకవర్గానికి అభివృద్ధి ప్రణాళిక రూపొందిస్తామని చంద్రబాబు ప్రకటించారు. మండల కేంద్రాల్లో వర్క్ స్టేషన్లు నిర్మిస్తామని తెలిపారు. భవిష్యత్తులో ఇంటి నుంచే పని చేసుకునే వెసులుబాటు కల్పిస్తామని చెప్పారు.కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్న టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు యువతతో భేటీ అయ్యారు. యువతకు సామాజిక బాధ్యత ఉండాలని సూచించారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక యువత ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా జాబ్ కేలండర్ విడుదల చేస్తామని సీఎం వైఎస్ జగన్ యువతను మోసం చేశారని చంద్రబాబు విమర్శించారు. గత ఐదేళ్లలో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టలేదని మండిపడ్డారు. ఎన్నికల ముందు మాత్రం డీఎస్సీ పేరుతో హడావుడి చేస్తున్నారని విమర్శించారు. గ్రూప్-1 ఉద్యోగాలను నచ్చినవారికి ఇచ్చుకున్నారని ఆరోపించారు.ఏపీని క్షాపాడుకునేందుకు పొత్తులు పెట్టుకున్నామని

వివరాలు 2లో

# 11వ సీట్ కోసం పట్టు పడుతున్న బిజెపి.. రాజంపేట కోసమేనా..?



**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 26:** ఏపీలో భారతీయ జనతా పార్టీ మరో సీటు కోసం పట్టుబడుతున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటికి పది అసెంబ్లీ సీట్లను కేటాయించారు.వాటిలో అభ్యర్థులను ఖరారు చేసే ప్రక్రియలో ఉన్నారు. అయితే పార్టీ నేతల నుంచి టిక్కెట్ల కోసం ఒత్తిడి పెరిగిపోవడంతో మరో సీటును కేటాయించాలని టీడీపీని కోరుతున్నట్లుగా తెలుస్తోంది. ఏపీకి ఎన్నికల ఇంచార్జ్ గా బీజేపీ సీనియర్ నేత అరుణ్ సింగ్ వచ్చారు. ఆయన నేతృత్వంలో బీజేపీ పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అరుణ్ సింగ్.. బీజేపీ పదకొండు స్థానాల్లో పోటీ చేస్తుందని ప్రకటించారు. అయితే ఆ పదకొండో స్థానం ఏమిటో చెప్పలేదు. కడప జిల్లాలోనే మరో స్థానం కోరుతున్నట్లుగా చెబుతున్నారు. ఉమ్మడి కడప జిల్లాలో రాజంపేట లేదా.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని బీజేపీ కోరుతున్నట్లుగా తెలుస్తోంది.బీజేపీ ప్రతిపాదనలపై టీడీపీ స్పందన ఎలా ఉందో స్పష్టత లేదు. ఇప్పటికే కడప జిల్లాలో ఓ సీటు జనసేనకు..మరో సీటు బీజేపీకి ఇచ్చినందున మరో సీటు ఇచ్చే అవకాశం లేదని సమాధానం ఇచ్చినట్లుగా చెబుతున్నారు. పదాధికారుల భేటీలో ఎన్నకిల వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించారు. బుధవారం సాయంత్రంలోగా ఏపీ బీజేపీ అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించే అవకాశాలున్నాయి. పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా గెలుపు కోసం పని చేయాలని కిందిస్థాయి నేతలకు అగ్ర నేతలు దిశా నిర్దేశనం చేశారు. పార్టీ కోసం పని చేసిన నేతలకు అవకాశాలు రాకున్నా బాధపడొద్దని ముఖ్య నేతలు చెబుతున్నారు. పొత్తులో భాగంగా త్యాగాలు తప్పవని బుజ్జగిస్తున్నారు. టికెట్లు దక్కకపోయినా పార్టీ అందరి సేవలనూ గుర్తు పెట్టుకుంటుందని పార్టీ పెద్దలు భరోసా కల్పిస్తున్నారు. కలిసికట్టుగా పని చేసి విజయం సాధించాలని కేడర్కు దిశానిర్దేశం చేస్తున్నారు.ఇక వచ్చే నెల 5 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ప్రచారాన్ని చేపట్టనుంది. ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి ఎంపీగా బరిలోకి దిగుతున్న రాజమండ్రి నుంచే ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. పార్టీ జాతీయ నాయకులు, కేంద్ర మంత్రులు ప్రచారసభల్లో పాల్గొనేలా టూర్ షెడ్యూల్ను ఖరారు చేస్తున్నారు. వీటితో పాటు

వివరాలు 2లో

# షర్మిల టార్గెట్ అధికారమా.? అన్న ప్రభుత్వాన్ని కూల్చడమా..?





**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 26:** వైఎస్ షర్మిలా రెడ్డి.. తెలంగాణపై జెండా పాతేస్తనని.. అది వీలుకాక.. ఇప్పుడు ఏపీని ఏలేయ్యాలని రెడీ అయ్యారు.కాంగ్రెస్‌లో చేరారు. పీసీసీ చీఫ్ పదవి తీసుకున్నారు. బాగుంది.. అంతా బాగుంది. కానీ ఏపీలో కాంగ్రెస్‌కు అంత సీన్ ఉందా? అసలు ఏపీ ఎన్నికల్లో షర్మిల ఎఫెక్ట్ ఉంటుందా? షర్మిల టార్గెట్ అధికారమా? లేక అన్నను కూల్చడమా? వైఎస్ఆర్ తెలంగాణ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి.. ఏపీలో కాంగ్రెస్ పదవి దక్కించుకున్నారు వైఎస్ షర్మిల. పగ్గాలు చేపట్టిన నాటి నుంచి అన్న వైఎస్ జగన్ పాలనపై విరుచుకుపడుతున్నారు. నానా తిట్లు తిడుతూ ముందుకు వెళుతున్నారు షర్మిల. ఇప్పటికే ఉత్తరాంధ్రను చుట్టేశారు. రాయలసీమలో పర్యటించారు. కానీ ఎన్నికల్లో గెలిచే సత్తా కాంగ్రెస్‌కు ఉందా? అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను దింపే సత్తా షర్మిలకు ఉందా? ఇప్పుడీ ప్రశ్నలు ఏపీ ప్రజల మదిలో ఉన్నాయి.ఏపీలో కాంగ్రెస్ ఎన్ని సీట్లు గెలుస్తుంది? ఇది కాదు ప్రశ్న. ఎన్ని ఓట్లను చీలుస్తుంది? ఇదీ అసలు ప్రశ్న. ఎందుకంటే షర్మిల వచ్చిన టైమింగ్. ప్రచారశైలి చూస్తుంటే కాంగ్రెస్‌కు చెప్పుకోదగ్గ సీట్లు వచ్చే అవకాశాలు లేవు. కానీ చాలా ఓట్లను చీల్చడం ఖాయంగా కనిపిస్తోంది.మరి షర్మిల చీల్చేది ఎవరి ఓట్లను? షర్మిల ఎంట్రీ ఎవరికి లాభం? ఎవరికి నష్టం? అంటే ముమ్మాటికి వైసీపీకే నష్టమని చెప్పాలి. ఈ మాట ఎందుకు చెప్పాల్సి వస్తుందంటే.. ఎస్సీ, క్రిస్టియన్ ఓట్లలో వైసీపీకే మెజార్టీగా పడతాయి. కొడితే కుంభస్థలాన్నే కొట్టాలన్నట్లు.. వైసీపీకి ఆయువుపట్టైన ఎస్సీ ఓట్లనే టార్గెట్ చేశారు షర్మిల. ఎస్సీ సామాజికవర్గ నేతలను టార్గెట్ చేస్తున్నారు. క్రిస్టియన్ ఓటర్లను కాంగ్రెస్ వైపు తిప్పేందుకు.. భర్త అనిల్ కుమార్ కూడా రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. ఈ విషయంలో కనుక షర్మిల సక్సెస్ అయితే వైసీపీకి పెద్ద దెబ్బ అనే చెప్పాలి.లాస్ట్ వీక్‌లో జరిగిన పొలిటిలక్ డెవలప్‌మెంట్స్‌ను అబ్జర్వ్ చేస్తే.. వైసీపీ నందికొట్కూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆర్థర్ కాంగ్రెస్‌లో చేరారు. చింతలపూడి సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలిజా.. లేటెస్ట్‌గా కోడుమూరు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సీనియర్ నేత పరిగెల మురళీకృష్ణ కూడా.. కాంగ్రెస్ కండువా కప్పేసుకున్నారు. పూతలపట్టు సిట్టింగ్ ఎమ్మెల్యే బాబు కూడా ఇప్పటికే షర్మిలతో టచ్‌లో ఉన్నారు. చూస్తుంటే వైసీపీకి గట్టిపట్టున్న ఎస్సీ నియోజకవర్గాల్లో మకాం వేయాలని చూస్తున్నారు షర్మిల. నిజానికి దశాబ్ధాలుగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు కాంగ్రెస్‌కు ఓటు బ్యాంక్‌గా ఉన్నాయి. అయితే వైసీపీ ఎంట్రీతో ఆ ఓట్లన్ని వైసీపీకి మళ్లాయి. ఇప్పుడు మళ్లీ వాటిని తమవైపు తిప్పుకునేందుకు పావులు కదుపుతున్నారు షర్మిల.వైఎస్ఆర్ కూతురుగా ఉన్న చరిష్మా,

వివరాలు 2లో

# జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోండి

**- వేసవి దృష్ట్యా త్రాగునీటి కోసం కార్యాచరణ ప్రణాళికలు రూపొందించండి - జిల్లా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు**

**ఆంధ్ర ప్రగతి/నంద్యాల, మార్చి 26:** వేసవి దృష్ట్యా త్రాగునీటికి ఇబ్బంది లేకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవడంతో పాటు తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం ఆయన ఛాంబర్ నందు వేసవిలో జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్, పంచాయితీ, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో త్రాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న 16 మండలాల్లో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తీవ్ర త్రాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న గ్రామాల్లో ట్రాన్స్పోర్టేషన్ ద్వారా వీటిని సరఫరా చేయాలన్నారు. ఎక్కడైతే బోర్లు మరమ్మతులకు గురయ్యాయో వాటిని గుర్తించి వెంటనే రిపేరు చేయించి త్రాగునీటికి అనుగుణంగా



అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ ను కలెక్టర్ ఆదేశించారు. బోర్లలో డీపెనింగ్, ఫ్లషింగ్ తదితర మరమ్మతులను వెంటనే చేయించాలన్నారు. 15 ఆర్థిక సంఘం నిధులను వినియోగించి గ్రామాల్లో సిపిడబ్ల్యూఎస్ స్కీం లను పునరుద్ధరించి నీటి సమస్య రాకుండా చూడాలని పంచాయతీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.వచ్చే ఏప్రిల్, మే మాసాలను దృష్టిలో ఉంచుకొని నీటి వనరుల లభ్యతను బట్టి కేసీ కెనాల్, కుందు నదుల ద్వారా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, కుంటలు నింపుకోవాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భవిష్యత్తులో త్రాగునీటి సమస్య ఏర్పడే ప్రాంతాలను గుర్తించి కంటింజెంట్ ప్లాన్ సిద్ధంగా ఉంచుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈని కలెక్టర్ ఆదేశించారు. జూపాడుబంగ్లాలో పిడబ్ల్యూఎస్ స్కీం కింద త్రాగునీటి పథక పనులు చేపట్టేందుకు అనుమతులు అవసరం లేదని ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులు మొదలు పెట్టాలని కలెక్టర్ సూచించారు. మహిళా సమైక్య పొదుపు గ్రూపుల ద్వారా నీటి పొదుపు వాడకంపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డిఆర్డిఏ పిడిని కలెక్టర్ ఆదేశించారు. రక్షిత నీటి పథకాలకు సంబంధించిన పనుల ప్రతిపాదనలు బుధవారం సాయంత్రంలోగా పంపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, పబ్లిక్ హెల్త్ ఈఈ, ఇరిగేషన్ ఎస్ఈ, డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి మోహనరావు, ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ, డిపిఓ మంజులవాణీ, డి ఆర్ డి ఏ పి డి శ్రీధర్ రెడ్డి, డ్వామాపిడి రామచంద్ర, గ్రౌండ్ వాటర్ డిడి రఘురాం, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వాలంటీర్లకు 50,000 ఆదాయం వచ్చేలా చేస్తా...: చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు తెలిపారు. టీడీపీ, జనసేన , బీజేపీ అందుకే కలిశాయన్నారు. జెండాలు వేరైనా.. అజెండా మాత్రం ఒక్కటేనని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. వైసీపీ నేతలు భూములు కొల్లగొడుతున్నారని చంద్రబాబు ఆరోపించారు. సర్వే నంబర్స్ మార్చి ప్రజల భూములను ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. సొంత నియోజకవర్గం కుప్పంలోనూ తనకు బెదిరింపులు తప్పటం లేదన్నారు. ఇక ఏపీలో సామాన్యుల పరిస్థితి ఏంటో ఆలోచించుకోవాలన్నారు. ఏపీలో ఖనిజ సంపదను వైసీపీ నేతలు దోపిడీ చేస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయని మండిపడ్డారు. ఇలా అడ్డదారుల్లో డబ్బు సంపాదించడమే లక్ష్యంగా వైసీపీ నేతలు ఉన్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో జే బ్రాండ్ మద్యాన్ని నిషేధిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీని మళ్లీ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. తన హయాంలో యువతకు ఐటీ ఉద్యోగాలతో కొత్తదారి చూపించానని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అక్రమార్కుల చేతుల్లో పడితే చాలా ప్రమాదకరమని చంద్రబాబు హెచ్చరించారు. పారదర్శకంగా జరగాల్సిన పాలనలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. టెండర్స్ లోనూ అక్రమాలు చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు రెండు రోజుల పాటు కుప్పంలో విస్తృతంగా పర్యటించారు.

# 11వ సీట్ కోసం పట్టు పడుతున్న బిజెపి.. రాజంపేట కోసమేనా..?

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు కలిపి ఉమ్మడి బహిరంగ సభలు కూడా ఎక్కడెక్కడ నిర్వహించాలనే దానిపై ఆలోచన చేస్తున్నారు. నియోజకవర్గాలకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకునేలా ట్రైనింగ్ ఇస్తున్నారు. పోటీ చేయబోయే నియోజకవర్గాలకు ప్రత్యేకంగా కొన్ని టీమ్లను ఎంపిక చేయనున్నారు. బీజేపీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న సీనియర్లకు, నియోజకవర్గంపై పట్టున్న లీడర్లకు ప్రచార బాధ్యతలు అప్పగించనున్నారు.పదాధికారుల భేటీకి సీనియర్ నేతలు విష్ణువర్ధన్ రెడ్డి, సోము వీర్రాజు, జీవీఎల్ నరసింహారావు వంటి వారు హాజరు కాలేదు. పోటీ చేసే సీట్లు దక్కనందునే వారు హాజరు కాలేదని తెలుస్తోంది. అయితే సోము వీర్రాజుకు అవకాశం కల్పించేందుకు పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారని అంటున్నారు. రాజమండ్రి రూరల్ లేదా అర్బన్ సీట్లలో ఒకటి కేటాయించాలని అడుగుతున్నారని చెబుతున్నారు. కానీ ఇప్పటికే టీడీపీ అభ్యర్థులు ప్రచారం చేసుకుంటున్నారు.

# ఎన్నికల ప్రచారంపై ఏపీ బీజేపీ ఫోకస్.. రంగంలోకి అగ్ర నాయకులు..!

**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చ్ 26:** ఏపీలో బీజేపీ, టీడీపీ లతో పొత్తు పెట్టుకున్న బీజేపీ పొత్తులో భాగంగా 10 అసెంబ్లీ, ఆరు లోక సభ స్థానాలను తీసుకుంది. తాము పోటీ చేయబోతున్న ఆరు లోక్ సభ స్థానాలకు అభ్యర్థుల ప్రకటన పూర్తి చేసింది.అసెంబ్లీ అభ్యర్థుల జాబితాను త్వరలోనే ప్రకటించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే అభ్యర్థుల జాబితాను ఫైనల్ చేసే విషయంలో బిజెపి అగ్ర నాయకులతోను పురందరేశ్వరి చర్చలు జరిపారు. ఇక పూర్తిస్థాయిలో ఎన్నికల ప్రచారం పైనే పురందరేశ్వరి నిమగ్నం అయ్యారు ఈ మేరకు ఈ రోజు బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారం ఏ విధంగా చేపట్టాలి.జనాల్లోకి ఏ విధంగా వెళ్లాలి.. ఎక్కడెక్కడ బహిరంగ సభలు నిర్వహించాలి.. ఎవరిని ముఖ్య అతిథులుగా ఆహ్వానించాలి ఇలా అనేక అంశాలపై పార్టీ నాయకులతో చర్చిస్తున్నారు. నేడో, రేపు పూర్తిస్థాయిలో అసెంబ్లీ అభ్యర్థుల జాబితా కూడా పూర్తి చేసి ఎన్నికల ప్రచారంపైనే ఫోకస్ చేయనున్నారు.వచ్చేనెల 5వ తేదీ నుంచి బిజెపి పూర్తిస్థాయిలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించే విధంగా సన్నాహాలు చేస్తున్నారు.పురందరేశ్వరి రాజమండ్రి నుంచి ఎంపీగా పోటీ చేయబోతూ ఉండడం తో అక్కడి నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించుకున్నారు. ఏపీలో త్వరలో బిజెపి చేపట్టబోయే ఎన్నికల ప్రచారంకు బిజెపి అగ్ర నేతలు హాజరయ్యే విధంగా ప్లాన్ చేస్తున్నారు. కేంద్ర మంత్రులు, జాతీయ నేతల షెడ్యూల్ కు అనుగుణంగా ఏపీలో సభలు నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నారు. అలాగే టిడిపి ,జనసేనతోనూ ఉమ్మడిగా నిర్వహించే సభల పైన ఆయా పార్టీలతో పురందరేశ్వరి చర్చిస్తున్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పూర్తిగా ఎన్నికల ప్రచారం చేపట్టి , రాష్ట్రవ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహించే విధంగా పురంద్రేశ్వరి షెడ్యూల్ రూపొందించే పనిలో నిమగ్నం అయ్యారు.

# షర్మిల టార్గెట్ అధికారమా.? అన్న ప్రభుత్వాన్ని కూల్చడమా..?


(మొదటి పేజీ తరువాయి)



ఎస్సీల్లో పెరుగుతున్న మద్దతు, క్రిస్టియన్ ఓటర్లను మచ్చిక చేసుకోవడం, ఇవన్నీ జరిగితే రాయలసీమతో పాటు ఉత్తరాంధ్రలో వైసీపీకి దారుణంగా పడుతుంది దెబ్బ. ఇప్పటికే జనసేనతో పొత్తు పెట్టుకొని కాపు ఓటర్లను తమవైపుకు తిప్పుకునేందుకు.. టిడిపి స్కెచ్ వేసింది. ఇక షర్మిల ఎస్సీలపై కాన్సన్‌ట్రేట్ చేస్తే.. వైసీపీ అంచానాలు, సీట్ల లెక్కలు తలకిందులవడం తథ్యం.వైసీపీలో ఉన్నది చాలా మంది పూర్వపు కాంగ్రెస్ నేతలే.. ఇప్పుడు వారందరినీ టచ్ చేస్తున్నారు కాంగ్రెస్ నేతలు. వైసీపీలోనూ షర్మిల అభిమానులు ఉన్నారు. వైసీపీలో టికెట్ దక్కని అసంతృప్తులు ఉన్నారు. ఇప్పుడు వీరి డెస్టినేషన్ కాంగ్రెస్. ఇదంతా నాణానికి ఒకవైపు మాత్రమే. మరోవైపు చూస్తే షర్మిల ఇంతవరకు ఒక్క అభ్యర్థిని కూడా అనౌన్స్ చేయలేదు. అసలు అభ్యర్థులు ఉన్నారా? లేరా? అన్నది కూడా డౌటే. కానీ తెర వెనుక చేయాల్సిందంతా చేసేస్తున్నారు షర్మిల. ప్రస్తుతం చూస్తుంటే తాను నెగ్గడం కంటే.. అన్నను కూల్చడంపైనే ఎక్కువ ఫోకస్ చేస్తున్నట్టు కనిపిస్తోంది షర్మిల. ఇదైతే ఖచ్చితంగా బీజేపీ, టీడీపీ, జనసేన కూటమికి కలిసొచ్చేదే అని చెప్పాలి. ముఖ్యంగా వైసీపీ డ్యామ్ షూర్ సీట్లు అని లెక్కేసుకున్న స్థానాల్లో.. షర్మిల మంత్రాంగం పనిచేస్తే మాత్రం కూటమి నేతలు ఫుల్ హ్యాపీ.కానీ ఏపీ ప్రజల్లో కాంగ్రెస్ నేతలపై ఇంకా పూర్తిగా పోలేదు. చాలా మంది కాంగ్రెస్‌ను అంతగా కన్సిడర్ చేయడం లేదు. దీనికి తోడు షర్మిల్ పొలిటికల్ కాండాక్ట్‌ను వ్యాలీడేట్ చేస్తే.. అంతగా గొప్పగా మార్కులు పడవు. ఎందుకంటే తెలంగాణలో ఉన్నప్పుడు ఆ ప్రాంత కొడలినని చెప్పారు. ఇప్పుడు ఆంధ్రా అమ్మాయినంటూ తిరుగుతున్నారు. ఏపీ ప్రజలు ఇవన్నీ గమనిస్తూనే ఉన్నారు. ఏదేమైనా.. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే.. చెల్లె వేసే బాణాలు.. గట్టిగా కాకపోయినా.. కాస్తైనా అన్నకు గుచ్చుకోవడం ఖాయమన్న టాకైతే ఉంది.

# జనసేన పార్టీకి పవన్ కల్యాణ్ రూ.10 కోట్ల విరాళం

**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చ్ 26:**జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పార్టీకి రూ. 10 కోట్ల విరాళాన్ని అందజేశారు. పార్టీ నిర్వహణ అవసరాలకు గాను జనసేన కోశాధికారి ఎ.వి రత్నంకు చెక్కును మంగళవారం అందజేశారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో అనేక మంది నాయకులు, ప్రజలు తాము కష్టార్జితంగా సంపాదించిన వాటిలో కొంత భాగం ఉద్యమ నిర్వహణకు నిధులు ఇచ్చారని తెలిపారు. అదే స్ఫూర్తితో తాను సినిమా పరిశ్రమ ద్వారా సంపాదించిన దాంట్లో నుంచి ఎప్పటికప్పుడు పార్టీకి తన వంతుగా నిధులిస్తూనే ఉంటానని పేర్కొన్నారు. దీంట్లో భాగంగా రూ.10 కోట్లను పార్టీ నిర్వహణ, కార్యకలాపాలకు అందించానని వెల్లడించారు. ఎన్నికల నిర్వహణ, పార్టీని నడపడం డబ్బుతో కూడుకుందని తెలిపారు. జనసేన పార్టీ పేదల నుంచి పెద్దల వరకు పార్టీ ఫండ్ కింద నిధులను పంపిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు.



## ఇఫ్తార్ విందులో ఎన్ఎండి ఫరూక్



**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 26:** నంద్యాల టౌన్ గాంధీ చౌక్ నందు గల మసీద్ ఏ ఖురైష్ లో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో మాజీ మంత్రివర్యులు నంద్యాల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఒక పొద్దు ఉంటారని వారికి ఆ అల్లా ఎల్లవేళలా తోడుండాలని అంత మంచి జరగాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## నిరుపేద వివాహానికి సహాయం చేసిన ఆర్యవైశ్యులు



**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 26:** నంద్యాల హరిజనవాడకు చెందిన నిరుపేద అమ్మాయి వివాహం ఖర్చుల నిమిత్తం సోదరుడు జోసెఫ్ ద్వారా నంద్యాల జిల్లా వాసవి సేవా దళ్ మరియు వాసవి క్లబ్ బాలాజీ వైశ్య మిత్ర అధ్యక్షుడు బింగుమళ్ళ శ్యామ్ సుందర్ గుప్త ని సంప్రదించగా వారు స్పందించి అమ్మాయి తల్లిదండ్రులకు వివాహ ఖర్చులు నిమిత్తం నగదు మరియు అమ్మాయికి వెండి మెట్టెలు అవసరమైన సరుకులు పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కౌన్సిలర్ నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు కండె శ్యాంసుందర్ లాల్. బాలాజీ సొసైటీ ప్రెసిడెంట్ బింగుమల్ల సుబ్బ లక్ష్మయ్య గారు మరియు వాసవి క్లబ్ జిల్లా కోశాధికారి మల్లిపెద్ది నాగరాజు నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం కోశాధికారి మావిళ్ళ నాగరాజు అదనపు ప్రధాన కార్యదర్శి ఆదవేణి మురళి సెక్రెటరీ జనార్ధన్ క్లబ్ సెక్రటరీ నవీన్ కోశాధికారి చంద్రమౌళి గారు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసినరు.

## నేటి నుంచి 'మేమంతా సిద్ధం' సభలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

గత ఐదేళ్లుగా అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను ప్రదర్శించేందుకు 'మేమంతా సిద్ధం' పేరుతో వైఎస్ జగన్ బస్సుయాత్ర ప్రతి నియోజకవర్గంలో పర్యటించనున్నారు.నేడు ప్రారంభ కానున్న ఈ కార్యక్రమం, మొదట వైయస్ జగన్ ఇడుపులపాయలోని రాజశేఖర్ రెడ్డి ఘాట్ వద్ద ప్రార్థనలు చేసిన తర్వాత యాత్రను ప్రారంభించనున్నారు. తొలి బహిరంగ సభ కోసం కమలాపురం, జమ్మలమడుగు మీదగా వెళ్లి ప్రొద్దుటూరు వరకు యాత్ర సాగనుంది. ప్రొద్దుటూరు బహిరంగ సభలో వైయస్ జగన్, ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న వాగ్దానాలను సవాల్ చేసే లక్ష్యంతో ప్రణాళికలు చేస్తున్నారు. మేనిఫెస్టో వివరాలను వెల్లడించే అవకాశం కూడా ఉంది. ఇటీవలి సిద్ధం సమావేశాల సందర్భంగా కొత్త సంక్షేమ పథకాల ప్రకటన ఉంటుందని విశ్లేషకులు అంచనా వేశారు, అయితే ప్రతిపక్ష పార్టీలు తమ వాగ్దానాలను ప్రకటించే వరకు వేచి ఉండటానికే వైయస్ఆర్సీపీ కమిటీ ప్రాధాన్యతనిస్తుందని పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే ఎన్నికల తేదీ దగ్గరపడుతున్న వేళ యాత్రలో ముఖ్యమంత్రి మేనిఫెస్టోను ప్రకటించే అవకాశం ఉంది. మొదటి దశగా కడప, కర్నూలు, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరుతో సహా రాయలసీమ ప్రాంతంలోని ఆరు జిల్లాల్లో యాత్ర సాగనుంది. ముఖ్యంగా అనంతపురం, హిందూపురం లోక్‌సభ సెగ్మెంట్లు రెండింటినీ కవర్ చేసే రాప్తాడులో ఇటీవల నిర్వహించిన సిద్ధం కారణంగా అనంతపురం రూట్ మినహాయించబడింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమగ్రంగా మేమంతా సిద్ధం చేయనున్నామని ప్రాంతీయ సమన్వయకర్త పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.ఇడుపులపాయ, ప్రొద్దుటూరు కార్యక్రమాల ఏర్పాట్లను డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, రవీంద్రనాథ్‌రెడ్డి, రాచమల్లు శివప్రసాదరెడ్డితో పాటు ఇతర నేతలు కడప ఎంపీ వైఎస్ అవినాష్ పర్యవేక్షిస్తున్నారు.



# శ్రీ భీమలింగేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు



**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 26:** నంద్యాల పట్టణంలో వెలిసిన శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానం నందు( మూలమట్టం) హుండీ లెక్కింపు కార్యక్రమం మంగళవారం నాడు భక్తుల సమర్పించిన కానుకలను లెక్కించడం జరిగినది. ఒక సంవత్సరంనకు సుమారు.42634/- రూపాయలు వచ్చినవి. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమాలకు సూపర్వైజర్ గా కోటపాడు గ్రూప్ దేవస్థానముల కార్యనిర్వహణాధికారి శ్రీ వేణునాధ రెడ్డి సమక్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో బాలాజీ మహిళా మండలి సభ్యురాలు పాల్గొనడం జరిగినది. దేవస్థానం ఎక్స్ చైర్మన్ శ్రీ సన్నాల వెంకటరెడ్డి మరియు పట్టణ ప్రజలు పాల్గొనడం జరిగినదనిదేవస్థానం కార్యనిర్వాహణాధికారి టి రామాంజనేయ శర్మ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ధన్యవాదాలు తెలియజేశారు.

# టీడీపీ జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబి వైసీపీలో చేరిక



**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 26:** టీడీపీ జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబీ, ఫరూక్, సీఎం బాష, అన్వర్ సోమవారం మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి సమక్ష్యంలో 24వ వార్డు వైఎస్సార్సీపీ ఇంచార్జి షేక్ రహంతుల్లా, సీనియర్ అడ్వకేట్ శ్రీనివాసులు, వైసీపీ నాయకులు మునయ్య, రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి ప్రసాద్ ఆద్వర్యంలో టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. వీరందరిని మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదర స్వాగతం పలికారు. పార్టీ భలోపేతానికి, విజయానికి కృషిచేయాలని కోరారు. మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పాలన, అభివృద్ధికి ఆకర్షితులైన వారు పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎంగా జగన్ మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యేగా శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డిని, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డి విజయానికి శక్తిపంచనలేకుండా కృషిచేయాలని కోరారు.

# 12 వ వార్డు వైసిపి నాయకులు టిడిపిలోకి చేరిక

**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 26:** నంద్యాల పట్టణం 12 వ వార్డుకు చెందిన వైసిపి కార్యకర్తలు, అభిమానులు మంగళవారం నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ సమక్ష్యంలో టీడీపి లోకి చేరడం జరిగింది. వీరికి టీడీపీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించడం జరిగింది. పార్టీ భలో పేతానికి, విజయానికి కృషి చేయాలని కోరారు.ఈ సందర్భంగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ... వైసిపి ని వీడి టీడీపీ పార్టీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. టిడిపి భలోపేతానికి కృషిచేయాలని, మీకు ఎల్లవేలలా అందుబాటులో ఉంటానని, సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అలాగే 12 వార్డులో తెలుగుదేశం పార్టీకి మెజారిటీ తీసుకొని రావాలని కోరారు. అలాగే కొందరు వైసిపి ఏజెంట్లు తెలుగుదేశం పార్టీ నాయకులను డబ్బులు పెట్టి కొనాలను చూస్తే తెలుగుదేశం పార్టీ నాయకులు అమ్ముడుపోరని తెలుగుదేశం పార్టీ నాయకులు తెలుగుదేశంతోనే కొనసాగుతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన వారు ఖాజా హుసేన్, షబ్బీర్, సురేష్, మాబాషా, అమీర్, బాలాజీ, అబ్దుల్, ఇమ్రాన్, కరీం, జమీల్ బాష, రియాజ్, శ్రీనివాసులు, మాబాషా, నాగరాజు, నాగేంద్ర, తది తరులు ఉన్నారు.



# బడుగులను బలి తీసుకోవడమే నా సామాజిక న్యాయమంటే జగన్ రెడ్డి

**- మాజీ మంత్రి నంద్యాల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్**

**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 26:** జగన్ రెడ్డి పాలనలో బడుగు , బలహీన వర్గాల ఆస్తులకు రక్షణ లేదన్న విషయం చేనేత కుటుంబ బలవంతపు మరణంతో మరోసారి రుజువైందన్నారు .. చేనేత కుటుంబం బలవంతపు మరణానికి ఏం సమాధానం చెప్తావ్ జగన్ రెడ్డి ఇదేనా నువ్వు చెప్తున్నా సామాజిక న్యాయమని మాజీ మంత్రివర్యులు నంద్యాల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్ అన్నారు.ఈ సందర్భంగా స్ధానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత జిల్లా కడపలో చేనేత కుటుంబం ఆత్మ హత్యకు జగన్ రెడ్డిదే బాధ్యత అని వైసిపి నేతల భూ కబ్జాలకు నిండు కుటుంబం బలైందన్నారు. అలాగే రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం గ్రామానికి



చెందిన పాల సుబ్బారావు , భార్య పద్మావతి , చిన్న కుమార్తె వినయా ఆత్మహత్యకు పాల్పడటం చాలా బాధాకరమన్నారు నీ సొంత జిల్లాలోనే పేదల భూములు లాగేసుకుంటున్నారంటే ఇక రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు అన్నారు వ్యవస్థలను చేతుల్లోకి తీసుకుని రికార్డులు తారుమారు చేస్తున్నారన్నారు. వైసీపీ నాయకుల వేధింపులను ఆ కుటుంబం తట్టుకోలేక పోయిందని సొంత భూమిని కోల్పోయాం ప్రభుత్వం న్యాయం చేయదనే ఆవేదనతో పాల సుబ్బారావు కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిందని బడుగు, బలహీన వర్గాలంటే జగన్ రెడ్డికి చిన్నచూపు అన్నారు జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి టార్గెట్ చేసి మరీ బీసీలను వేధిస్తున్నారని బీసీల ఆస్తులు దిగమింగి వారిని బలి తీసుకోవడం జగన్ రెడ్డికి అలవాటుగా మారిందన్నారు . కొన్నాళ్ల క్రితం జగన్ సొంత జిల్లా కడపలో నందం సుబ్బయ్య అనే పద్మశాలీ నేతను అత్యంత దారుణంగా చంపేశారని నేటికీ నిందితులపై చర్యలు లేవన్నారు వచ్చే ఎన్నికలలో బడుగు, బలహీన వర్గాలు జగన్ రెడ్డికి బుద్ధి చెప్పడం ఖాయమని ఇకనైనా బీసీల పై ధమనకాండ ఆపి నిందితులపై చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# శ్రీశైలం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి బిగ్ షాక్..

**- వైసిపి పార్టీని వీడి టీడీపీలో చేరిన మోత్కూర్ గ్రామ సర్పంచ్ - ఉత్తేజపూరితమైన ఉపన్యాసాలతో తెలుగుదేశం పార్టీ శ్రీశైలం నియోజకవర్గం అభ్యర్థి బుడ్డ రాజశేఖర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతిరెడ్డి తులసిరెడ్డి**

**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 26:** నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం వెలుగోడు మండలం మోత్కూర్ గ్రామంలో వైసిపి పార్టీని వీడి 300 మంది పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగింది. శ్రీశైలం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకి వలసల జోరు రోజు కొనసాగుతోంది. సోమవారం వెలుగోడు మండలం మోత్కూరు గ్రామ సర్పంచ్ ముడిమేల చిన్నక్క, శ్రీశైలం నియోజకవర్గం వైసిపి బూత్ కమిటీ ప్రతినిధి మరియు వెలుగోడు మండల వైసిపి యువజన విభాగం అధ్యక్షుడు ముడిమేల సుధాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ పక్కిరమ్మ, 4వ వార్డు సభ్యులు వెంకట రమణ, 5వ వార్డు సభ్యులు లావణ్యల



ఆధ్వర్యంలో భారీ ఎత్తున వైయస్సార్ పార్టీకి చెందిన శ్రేణులు అధికార పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే, శ్రీశైలం అసెంబ్లీ టిడిపి అభ్యర్థి బుడ్డా రాజశేఖర రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బుడ్డా రాజశేఖర్ రెడ్డి, తాతిరెడ్డి తులసి రెడ్డి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభివృద్ధి మా అజెండా ప్రజలకు నిస్వార్థ సేవ చేయడం మా అంతిమ లక్ష్యం అని అన్నారు. పేదల బ్రతుకులు మారాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలి , ఆర్థికంగా స్థితిమంతులు కావాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలి అన్నారు. తదనంతరం ముడిమేల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. బుడ్డా రాజశేఖర్ రెడ్డి ని అత్యధిక భారీ మెజార్టీతో మనమందరం కలిసి భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు.

# ఎన్నికల్లో మీడియా క్రియాశీలక పాత్ర పోషించాలి

**- రాజకీయ ప్రకటనలకు ఎంసీఎంసీ కమిటీ ద్వారా అనుమతులు మంజూరు చేస్తాం**

**- జిల్లా కలెక్టర్, ఎంసీఎంసి చైర్మన్ డా. కె.శ్రీనివాసులు**

**ఆంధ్ర ప్రగతి/నంద్యాల, మార్చి 26:** భారత సార్వభౌమత్వానికి వ్యతిరేకంగా కాకుండా ప్రజాస్వామ్యంలోఎన్నికల సమగ్రతను, పారదర్శకత, జవాబుదారీతనాన్ని మెరుగుపరచడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. కె.శ్రీనివాసులు పేర్కొన్నారు.మంగళవారం ఆయన ఛాంబర్ లో సాధారణ ఎన్నికల నేపథ్యంలో మీడియా పోషించాల్సిన పాత్ర, ఫెయిడ్ న్యూస్, పత్రికలలో ప్రకటనలు, స్థానిక కేబుల్ ప్రసారాలలో రాజకీయ ప్రకటనలు తదితర అంశాలపై ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్రతినిధులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. పద్మజ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్రకుమార్, ఎంసిఎంసి నోడల్ అధికారి సునిల్ కన్నా, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు ఎంసీఎంసీ చైర్మన్ డా. కె.శ్రీనివాసులు మాట్లాడుతూ సాధారణ, పార్లమెంట్ ఎన్నికల్లో పాత్రికేయులు ప్రజలకు సరైన సమాచారాన్ని అందించడంలో అత్యంత క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. ఎన్నికలలో వివిధ విభాగాల లాగానే మీడియా కూడా ఎన్నికల్లో ముఖ్య పాత్ర పోషిస్తుందని... ప్రజలు పారదర్శకంగా స్వేచ్ఛాయిత వాతావరణంలో ఓటు వేయడానికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సహకరించాలన్నారు. ఓ వ్యక్తిని పొగుడుతూ ఒకే వార్త ఒకేలా



అన్ని పత్రికలలో ప్రచురితమైతే పెయిడ్ న్యూస్ కింద లెక్క కట్టి పోటీ చేసే అభ్యర్థి ఖాతాలో నమోదు చేస్తామన్నారు. అలాగే సంబంధిత పబ్లిషర్లకు కూడా నోటీసులు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా కేబుల్ ఛానెళ్ల ద్వారా ప్రసారమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి కచ్చితంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కమిటీ ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇవ్వడంతో పాటు, చెల్లింపు వార్తలను (పెయిడ్ న్యూస్) ఈ కమిటీ పర్యవేక్షించి సంబంధిత అభ్యర్థి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. పోలింగ్ రోజుకు 48 గంటల ముందు పత్రికల్లో ప్రచురించే రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్ మీడియాలో



రాజకీయ ప్రచార ప్రకటనలకు ఇప్పటినుండే ఎంసీఎంసీ ద్వారా అనుమతులు పొంది ప్రసారాలు చేయాల్సి ఉంటుందన్నారు.జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఫేక్ న్యూస్ లను కాకుండా సత్యమైన, వాస్తవిక దృష్టితో వార్తలు ప్రసారం అయ్యేలా మీడియా ముఖ్య భూమిక పోషించాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని జిల్లా ఎన్నికల మీడియా కేంద్రం నుంచి ఐ అండ్ పిఆర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు తెలియజేస్తామన్నారు. ఎన్నికల సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో, చైతన్య పరచడంలో పాత్రికేయులు సహకరించాలని కోరారు. రాజకీయ ప్రకటనలు, సోషల్ మీడియా ద్వారా, బల్క్ ఎస్ఎంఎస్లు, వాయిస్ మెసేజ్ లు, సినిమా హాల్లో ప్రకటనలకు సంబంధించి ముందుగా ఎంసిఎంసి ద్వారా ధ్రువీకరణ అయిన తర్వాతనే తదుపరి చర్యలు గైకొనాలన్నారు.

# చాగోలు గ్రామంలో ఇఫ్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్యే శిల్పా రవి



**ఆంధ్ర ప్రగతి/నంద్యాల రూరల్ మార్చి 26:** పవిత్ర రంజాన్ మాసంను పురస్కరించుకొని నంద్యాల మండలంలోని చబోలు గ్రామంలో మార్కద్ మసీద్‌లో ముస్లిం సోదరులతో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంఎల్ఏ శిల్పా రవి రెడ్డి,నంద్యాల



మండలంలోని చాబోలు గ్రామంలో మార్కద్ మసీద్‌లో మంగళవారం ముస్లిం సోదరులతో, పెద్దలతో కలిసి ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అల్లా అందరికి మంచి చేయాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం మసీద్ పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి ఆశీర్వదిం చారు. ఈ కార్యక్రమ ంలో వైఎస్సార్సీపీ గ్రామ వైసీపీ నాయకులు ,ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు సర్పంచ్ మౌనిక ,మదర్సా, హుస్సేన్ భాష, మహేష్, బాల ఉసేని , శ్రీను, నాగనంద రెడ్డి, మల్లికార్జున ,ఎంపీటీసీ దావీదు, శివ నారాయణ,అయూబ్, పారుక్, ఇలియాస్, కరీముల్లా, రషీద్, మా బాషా, జఫీజ్, హుసేన్ బాష, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నాం

**- జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు**

**ఆంధ్ర ప్రగతి/నంద్యాల, మార్చి 26:** భారత ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తేదీ నుండి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించకుండ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు పేర్కొన్నారు.మంగళవారం ఆయన ఛాంబర్ లో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో గుర్తించిన 25,300 ఫోటోలు, పోస్టర్లు, ఫ్లెక్సీ బ్యానర్లను తొలగించడం జరిగిందన్నారు. అలాగే ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ప్రచురితమైన ప్రతికూల వార్తలకు బాధ్యులను చేస్తూ సంబంధిత 40 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. రాజకీయ ప్రచారంలో పాల్గొన్న 12 మంది వాలంటీర్లను తొలగించడంతో పాటు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడ షోకాజ్



నోటీసులు ఇచ్చామన్నారు. అభ్యర్థుల ప్రచారానికి సంబంధించి వాహన అనుమతుల కోసం 123 దరఖాస్తులు వచ్చాయని అందులో 80 దరఖాస్తులకు వాహన అనుమతులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందు చేపట్టిన పనులు మాత్రం కొనసాగుతాయని కొత్త పనులు మాత్రం ఏవి మంజూరు చేయడం లేదన్నారు. సి విజిల్ ద్వారా 78 ఫిర్యాదులు అందాయని 100 నిమిషాల్లో సంబంధిత ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందన్నారు. ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోకుండా రాజకీయ పార్టీలు ప్రచారాన్ని కొనసాగిస్తే ఎంసిసి కింద చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని ఓ ప్రార్థన మందిరంలో రాజకీయ స్పీచ్ ఇచ్చినందులకు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. త్రాగునీటి సమస్య తలెత్తిన 16 మండలాల్లో త్రాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఎప్పటికప్పుడు ఎన్నికల సమాచారం సేవల కోసం కలెక్టరేట్ లో జిల్లా స్థాయి కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఓటర్ హెల్ప్ లైన్ నెంబర్ : 1950 (టోల్ ఫ్రీ), కాల్ సెంటర్ నెంబర్లు 08514 – 293905, 08514 – 293906 సంప్రదించి ఎన్నికల సమాచారంతో పాటు తమ ఓటు వివరాలను తెలుసుకోవచ్చునని కలెక్టర్ తెలిపారు.

# బీసీ, ఎస్సీ, మైనారిటీలకు సమాజ్ వాది పార్టీ అవకాశం కల్పిస్తోంది

**- సమాజ్వాది పార్టీ రాయలసీమ జిల్లాల కోఆర్డినేటర్ పాండురంగ యాదవ్ వెల్లడి**

**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 26:** వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో నంద్యాల జిల్లా నుండి వైసిపి మరియు టిడిపి పార్టీలు బీసీలను దగా చేస్తూ ఒకే సామాజిక వర్గానికి పెద్ద పీట వేస్తూ అభ్యర్థులను ప్రకటించడానికి సమాజ్వాది పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని సమాజ్ వాది పార్టీ రాయలసీమ జిల్లాల కోఆర్డినేటర్ పాండురంగ యాదవ్ పేర్కొన్నారు. సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తున్న టిడిపి వైసిపి పార్టీలకు బుద్ధి చెప్పడానికి బీసీలు మైనార్టీలు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. నంద్యాల జిల్లాలో సమాజ్ పార్టీ తరపున బీసీలకు ప్రాధాన్యత దక్కనుందని ఆయన తెలిపారు జిల్లాలోని బీసీ మేధావులు పెద్దలు ఉద్యోగులు, విద్యార్థులు




యువత ఆలోచన చేయవలసిన సమయం ఆసన్నమైందని తమకు ప్రాధాన్యత ఇవ్వని టిడిపి వైసిపిలను శాశ్వతంగా బొంద పెట్టాలని పిలుపునిచ్చారు.సమాజ్వాదీ పార్టీ ఎన్నికల గుర్తు సైకిల్ పంపుకు ఓటేస్తేనే వైసీపీ-టీడీపీ నాయకులను ఇంటికి పంపొచ్చని పేర్కొన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు పెరుగు శివ కృష్ణ యాదవ్ మాట్లాడుతూ బిసి ఎస్సి ఎస్టీ మైనారిటీ వర్గాల వేదికగా సమాజ్వాది పార్టీ ప్రజల ముందుకు వచ్చిందని కచ్చితంగా బహుజనులంతా సమాజ్వాది పార్టీని ఆదరించాలని కోరారు. నంద్యాల జిల్లా సమాజ్వాది పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి సమాజ్వాది పార్టీ మహిళా విభాగ రాష్ట్ర సహాయ కార్యదర్శి, నంద్యాల నియోజకవర్గ ఇన్చార్జి షేక్ ఫరీదాబి, నంద్యాల జిల్లా సమాజ్వాది పార్టీ కార్యదర్శి, నందికొట్కూరు ఇంచార్జ్ నక్క రాజేష్ , నంద్యాల జిల్లా అంబేద్కర్ వాహిని అధ్యక్షులు, శ్రీశైలం నియోజకవర్గం సమాజ్వాది పార్టీ ఇంచార్జ్ ఎనకండ్ల మధు, సమాజ్వాది పార్టీ నాయకులు మిద్దె వెంకట నాయుడు, ఓరుగంటి సుబ్బయ్య, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# టిడిపికి చెందిన జీవీ ప్రసాద్ మాజీ మంత్రి శిల్ప మోహన్ రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరిక

**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 26:** నంద్యాల పట్టణంలోని ప్రముఖ న్యాయవాది బలిజ కమ్యూనిటీకి చెందిన జీవీ ప్రసాద్ వారి కుటుంబ సభ్యులు నేడు మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీని వీడి వైసిపిలో చేరడం జరిగింది ముఖ్యంగా వైఎస్ఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నంద్యాలను జిల్లాగా ఏర్పాటు చేయడంలో అలాగే అభివృద్ధి చేయడానికి తన వంతుగా ఎంతో కృషి చేశారని వారు చేస్తున్న సేవ కార్యక్రమాలు ప్రజలకు చేరువ



వుతున్నాయని అందువల్లే నేడు మాజీ మంత్రి శిల్ప మోహన్ రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరడం జరిగిందన్నారు. ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి డాక్టర్ రవి కృష్ణ అడ్వకేట్స్ కృష్ణారెడ్డి, శ్రీనివా సులు రామసుబ్బయ్య తిమ్మారెడ్డి, దండే శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా నిఘా కట్టుదిట్టం చేసిన పోలీసులు...

**- ఎన్నికలు సమీపిస్తున్న వేళ చెక్పోస్టులలో ముమ్మర తనిఖీలు - జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి**

**ఆంధ్ర ప్రగతి/తమరాజుపల్లి, మార్చి 26:** నంద్యాల జిల్లాలో ప్రశాంత ఎన్నికల లక్ష్యంగా పోలీస్ అధికారులు అన్ని చర్యలు చేపడుతున్నారు. జిల్లాలోకి ప్రవేశించు అన్ని మార్గాలలో చెక్ పోస్ట లను ఏర్పాటు చేసి అక్రమంగా నగదు, మద్యం ,గంజాయి మొదలగునవి జిల్లాలోకి ప్రవేశించకుండా నిరంతరం తనిఖీలు చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఎస్పీ కె. రఘువీర్రెడ్డి అంతర్ జిల్లా చెక్పోస్ట్ అయిన తమ్మరాజు పల్లె చెక్పోస్ట్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు జారీ చేయడం జరిగింది.ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అక్రమ




రవాణాకు అడ్డుకునేందుకు జిల్లా సరిహద్దులలో చెక్పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందని, చెక్పోస్టులలో షిఫ్ట్ ల వారీగా విధులు నిర్వహిస్తున్నందున 24 / 7 సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని , ఏదైనా అనుమానం వస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. ప్రజలను ప్రలోభాలకు గురి చేయుటకు అక్రమంగా నగదు, మద్యం,గంజాయి మొదలగునవి అక్రమ రవాణా జరగకుండా నిరంతరం తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.చెక్ పోస్ట్లో మాత్రమే కాకుండా జిల్లాలో ప్రతిరోజు విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా వాహనాలను తనిఖీ చేయాలని, సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి సంతోష్. సిఐ లు సూర్య మౌళి,నల్లప్ప , ఎస్సై అశోక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందులో ఎన్ఎండి ఫిరోజ్

**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 26:** నంద్యాల టౌన్ దేవ నగర్ లోని నూరని మస్జిద్ మరియు ఇబ్రహీం మజీద్ లో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఒక పొద్దు ఉంటారని వారికి ఆ అల్లా ఎల్లవేళలా తోడుండాలని అంత మంచి జరగాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.




# శ్రీవారిని దర్శించుకున్న విశ్రాంత సీజే ఎన్వీ రమణ



**ఆంధ్ర ప్రగతి/తిరుమల,మార్చి 26 :** సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ మంగళవారం కుటుంబ సమేతంగా తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధికారులు రమణ కుటుంబ సభ్యులకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. టీడీపీ ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు స్వామివారిని దర్శించుకున్నారు. తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది . వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 15 కంపార్టుమెంట్లు నిండిపోగా , టోకెన్లు లేని భక్తులకు 12 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 78,731 మంది భక్తులు దర్శించుకోగా 25,156 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.40 కోట్లు వచ్చిందని వివరించారు.

# బెస్త సంఘం నిత్య అన్నదానం సత్రం నందు స్వతంత్ర పార్లమెంట్ అభ్యర్థి వెంకటరమయ్యని సన్మానించారు




**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చ్ 26:** అహోబిలం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం, నందు బెస్త (గంగపుత్రుల) సంఘం వారి నిత్య అన్నదానం సత్రం నందు నంద్యాలకు చెందిన మానస కూచిపూడి నాట్య ప్రదర్శన బృందం చిన్నారులు అనకల వెంకట నాగ తమజ్ఞ మరియు అన్విక, హాసిని, హేమశ్రీ, సహస్ర ల కూచిపూడి ప్రదర్శన అనంతరం నంద్యాల పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి గాగ్గెర వెంకటరమణ మరియు పారిశ్రామిక వేత్త కలియుగ ధనకర్ణుడు గువ్వాల గంగాధర్ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు.అనంతరం నంద్యాల పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి గగేరా వెంకటరామయ్యని సన్మానించారు.వెంకటరమయ్య మాట్లాడుతూ, గంగ పుత్రులు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా నేను ముందుంటాను అన్ని తెలిపారు. రాబోవు సర్వత్రిక ఎన్నికల్లో స్వాతంత్ర పార్లమెంట్ అభ్యర్థి గా నిలబడి మంచి మెజారిటీ తో గెలిపించాలి అన్ని కోరారు.గత ప్రభుత్వం కానీ ప్రస్తుత ప్రభుత్వం మన బెస్త సంఘం కి ఎటువంటి మేలు చేయలేదు అన్ని మన ఉమ్మడి జిల్లా లో 13లక్షలు పైగా బెస్త ఓట్లు ఉన్నాయి అన్ని, సరి అయినట్టు వంటి గుర్తింపు మన బెస్త (గంగపుత్రులు )ప్రభుత్వం ఇవ్వలేదు కనుకనే వచ్చే ఎన్నికల్లో స్వతంత్ర పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తునట్టు తెలిపారు. అనంతరం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వార్లని దర్శించుకున్నారు.

# ఆరవ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం



**ఆంధ్ర ప్రగతి/మహానంది, మార్చి 26:** మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని కస్తూరిబా ఉన్నత పాఠశాలలో 2024-2025 ఆరవ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా పాఠశాల ప్రిన్సిపల్ హర్షిత తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. అనాధలు, బడి బయట పిల్లలు, పేద విద్యార్థులు, ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనారిటీ బిపిఎల్ కుటుంబాలకు చెందిన బాలికలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకునేవారు ఏపీ కేజీబీవీ వెబ్సైట్లో ఏప్రిల్ 11 లోపు, అర్హులైన బాలికలందరూ దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునులు సలిబి, శిరీష, లక్ష్మి, దేవి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల టిడిపి ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరిని కలిసిన టిడిపి నాయకులు



**ఆంధ్ర ప్రగతి/కర్నూలు మార్చి 26:** నంద్యాల తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అభ్యర్థి బైరెడ్డి శబరిని కర్నూల్ నందు వారి నివాసంలో నంద్యాల టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలవడం జరిగినది. ఈ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంటు బీసీ సగర (ఉప్పర) సాధికారిక కన్వీనర్ ఉప్పరి సురేష్ కుమార్ 15వ వార్డు ఇంచార్జ్ ఎబినేజర్ కందాల వేణుగోపాల్ , ఆరవేటిరవీంద్ర కుమార్, నంద్యాల బీసీ సాధికారిక కన్వీనర్ శివకాంత్, గుడిపాటి రవికుమార్, తెలుగు జగదీష్ మరియు వారి మిత్రులు వెళ్లి కలవడం జరిగినది. తెలుగు దేశం పార్టీ నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడాలని అందుకోసం ప్రతి టిడిపి నాయకులు ఒక సైనికులపని చేయాలని పిలుపునిచ్చారు.